PRGI No : TGMUL/25/A1386

తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 348 పేజీలు - 08 బుధవారం 11 నవంబర్ 2026

తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నన్నిల్ పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

కరవు రైతులకు అండగా బ్యాంకులు నిలవాలి

- అర్హులైన రైతుల పంట రుణాల లీషెడ్యూల్‌కు ఆదేశాలు
- రబీ సీజన్‌లో కొత్త రుణాలు సకాలంలో అందించాలి
- 365 మండలాల్లో కరవు.. 111 మండలాల్లో తీవ్ర పరిస్థితులు
- బ్యాంకర్లకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిశానిర్దేశం



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 10 : రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న కరవు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు బ్యాంకులు అండగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. కరవుతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన రైతుల పంట రుణాలను రీషెడ్యూల్ చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. మిగతా2లో...

ప్రజల నమ్మకమే పోలీసుల బలం!

- ప్రజల కోసం అధికార హోదాను జాగ్రత్తగా వినియోగించాలి
- పోలీసు అధికారులు నిజాయితీ, అంకితభావంతో పనిచేయాలి
- అవసరమైతే అధ్యయనం కోసం విదేశాలకు పంపిస్తాం
- ప్రొబేషనరీ డీఎస్పీలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం



2లో

భారత్ సమ్మిట్‌కు రాహుల్ గాంధీకి ఆహ్వానం

హైదరాబాద్ సదస్సులో పాల్గొనాలని మహేశ్ గౌడ్ వినతి.. 100 దేశాల ప్రతినిధులకు ఆహ్వానం



2లో

13న బంగాళాఖాతంలో అల్పపీడనం


- తదుపరి 24 గంటల్లో తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం



2లో

చంద్రబాబు కేసులపై హైకోర్టు తీర్పు రిజర్వ్

- సీబీఐ, ఈడీకి అప్పగించాలన్న పిటిషన్లపై ఇరుపక్షాల వాదనలు పూర్తి



తొలి అక్షరం/అమరావతి,10 : ముఖ్యమంత్రి చంద్రబాబు ఇతరులపై గతంలో నమోదైన పలు కేసు ల దర్యాప్తును సీబీఐ, ఈడీకి అప్పగిం చాలన్న పిటిషన్లపై మిగతా2లో...

డిజిటల్ అరెస్టులు, సైబర్ మోసాల కట్టడికి సుప్రీంకోర్టు చర్యలు

- వాట్సాప్ సహా డిజిటల్ వేదికలకు కీలక ఆదేశాలు..
- అనుమానాస్పద లావాదేవీల నిలిపివేతకు సూచనలు




2లో

416 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి

- వెయ్యి గ్రామాల్లో కొనసాగుతున్న సర్వే ప్రక్రియ
- చిన్న పొరపాటు కూడా భవిష్యత్తులో భూ వివాదాలకు కారణం కాకూడదు
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 10 : రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వే ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు 416 గ్రామాల్లో సర్వే పూర్తికాగా, వెయ్యికి పైగా గ్రామాల్లో సర్వే పనులు ప్రారంభమయ్యాయి. తొలి దశలో మొత్తం 2,720 గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. తరతరాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు ప్రతి భూ యజమానికి స్పష్టమైన మిగతా2లో...



ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తున్న బీజేపీ

మోదీ ప్రభుత్వ విధానాలపై సోనియాగాంధీ విమర్శలు

దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, మీడియా స్వేచ్ఛపై ఆందోళన

తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 10: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య సంస్థలను క్రమంగా నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ విమర్శించారు. రాజకీయ, ఆర్థిక అధికారాన్ని కేంద్రీకరిస్తూ ప్రతిపక్షాల గొంతును నొక్కేస్తోందని ఆరోపించారు. మంగళవారం విడుదలైన తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'లో మిగతా2లో...

టర్కీ ఉక్కు కర్మాగారంలో ఘోర ప్రమాదం..

- భారీ పేలుడులో 16 మంది మృతి
- 13 మందికి గాయాలు..
- మరమ్మతు పనుల సమయంలో ఘటన



2లో

శిక్షణార్థులకు అంతర్జాతీయ వసతి సదుపాయం

- జీఎస్ఐలో నలంద ఇంటర్నేషనల్ హాస్టల్ ప్రారంభం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 10 : వివిధ ప్రాంతాల నుంచి శిక్షణ కోసం హైదరాబాద్‌కు వచ్చే విద్యార్థులు, శిక్షణార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించే దిశగా మరో ముందడుగు పడింది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్‌లో నూతనంగా నిర్మించిన నలంద

మిగతా2లో...

ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తున్న బీజేపీ

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వ విధానాలు, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థల పనితీరుపై పలు అంశాలను ప్రస్తావించారు. ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ఉపయోగిస్తున్నారని సోనియా ఆరోపించారు. ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేస్తూ, పార్లమెంటులో తగిన చర్చ లేకుండానే కీలక బిల్లులను ఆమోదిస్తున్నారని విమర్శించారు. ప్రధాన స్రవంతి మీడియాలోని కొన్ని విభాగాలు స్వతంత్రతను కోల్పోయాయని, ప్రభుత్వాన్ని విమర్శించేవారిపై సామాజిక మాధ్యమాల్లో దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. 2016 నోట్ల రద్దు నిర్ణయం ప్రజలకు, వ్యాపార రంగానికి తీవ్ర ఇబ్బందులు కలిగించిందని తెలిపారు. జీఎస్టీ అమలుతోనూ సమస్యలు ఎదురయ్యాయని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో ఆర్ఎస్ఎస్ భావజాల ప్రభావం పెరుగుతోందని, పాఠ్యపుస్తకాల్లో మార్పులు, నియామకాల ద్వారా విద్యా వ్యవస్థపై ప్రభావం చూపుతున్నారని ఆరోపించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు పేర్లు మార్చి, వాటి పరిధిని తగ్గించారని సోనియా విమర్శించారు. మైనారిటీలు, దళితులపై దాడులు, నిరసనలపై ఆంక్షలు వంటి అంశాలపైనా ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ సంస్థల స్వతంత్రతను, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరం ఉందని తన ఆత్మకథలో పేర్కొన్నారు.

డిజిటల్ అరెస్టులు, సైబర్ మోసాల కట్టడికి సుప్రీంకోర్టు చర్యలు

తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 10: దేశవ్యాప్తంగా పెరుగుతున్న డిజిటల్ అరెస్టు మోసాలు, సైబర్ నేరాలను అరికట్టేందుకు సుప్రీంకోర్టు కీలక చర్యలకు ఉపక్రమించింది. ఈ తరహా నేరాల నివారణకు తీసుకోనున్న చర్యలు, రూపొందించిన ప్రతిపాదనల వివరాలను సమర్పించాలని వాట్సాప్‌తో పాటు ఇతర డిజిటల్ వేదికలను ఆదేశించింది. తమ ప్రతిపాదనలను భారత సైబర్ నేరాల సమన్వయ కేంద్రం (ఐ4సీ)కి కూడా అందజేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. డిజిటల్ అరెస్టు మోసాలపై సుప్రీంకోర్టు స్వయంగా విచారణ చేపట్టి, గత కొన్ని నెలలుగా పరిస్థితిని పర్యవేక్షిస్తోంది.

ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇచ్చిన ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు చేపట్టిన చర్యలపై నివేదిక సమర్పించింది. ఇందులో భాగంగా పోలీసు, ఇతర ప్రభుత్వ అధికారుల పేర్లతో ప్రజలను మోసగిస్తున్న సైబర్ నేరగాళ్లకు సంబంధించిన సుమారు 9,400 ఖాతాలను వాట్సాప్ నిషేధించినట్లు వెల్లడించింది. సైబర్ మోసాల బారినపడి డబ్బులు కోల్పోతున్న బాధితులకు న్యాయం జరిగేలా బ్యాంకులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ధర్మాసనం సూచించింది. బ్యాంకుల నిర్లక్ష్యం లేదా తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే మోసాలు జరిగినట్లు దర్యాప్తులో తేలితే బాధితులకు నష్టపరిహారం చెల్లించే అంశాన్ని పరిశీలించాలని పేర్కొంది. అలాగే అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేయడం, వెంటనే పోలీసు అధికారులను అప్రమత్తం చేయడం వంటి రక్షణ చర్యలను రూపొందించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ని ఆదేశించింది. అధీకృత ఆర్థిక సంస్థల జాబితాను నవంబర్ 23లోగా సమర్పించాలని సూచించింది. ఈ కేసులో తదుపరి విచారణను నవంబర్ 23కు వాయిదా వేసింది.

ప్రజల నమ్మకమే పోలీసుల బలం!

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 10: సమాజంలో పోలీస్ వ్యవస్థకు ఉన్న విశ్వసనీయతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పోలీసు అధికారిపై ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజలు పోలీసులను నమ్మి తమ సమస్యల పరిష్కారం కోసం ఆశ్రయించేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసు అధికారులకు లభించిన హోదాను ప్రజాసేవ కోసమే వినియోగించా లని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన ప్రొబేషనరీ డీఎస్పీల ముఖాముఖి కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన అధికారులకు అవార్డులు అందజేశారు. క్రైమ్ సీన్స్ ఫోరెన్సిక్ హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరించారు. **పారదర్శకంగా నియామకాలు..** గతంలో గ్రూప్-1 నియామకాలు ఆలస్యం కావడంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని సీఎం గుర్తుచేశారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత యూపీఎస్సీ విధానాలను అధ్యయనం చేసి టీజీపీఎస్సీని అదే తరహాలో తీర్చిదిద్దినట్లు తెలిపారు. పోటీ పరీక్షల నిర్వహణలో అనుభవం, చిత్తశుద్ధి ఉన్నవారిని కమిషన్ సభ్యులుగా నియమించామని చెప్పారు. మొత్తం 112 మంది డీఎస్పీల నియామకాల్లో పూర్తి పారదర్శకత పాటించామని వెల్లడించారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే వారి పిల్లలు కూడా ఈ నియామకాల్లో ఎంపికయ్యారని పేర్కొన్నారు. నియామకాలపై కొందరు కోట్ల రూపాయల అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేసినప్పటికీ, ప్రభుత్వం సుప్రీంకోర్టు వరకు వెళ్లి నియామకాలను పూర్తి చేసిందని తెలిపారు. **ప్రజల సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి..** కొత్తగా పోలీసు శాఖలోకి వచ్చిన డీఎస్పీలు తమ నేపథ్యాన్ని, ఏ లక్ష్యంతో ఈ శాఖలో చేరారో ఎప్పుడూ మరిచిపోవద్దని రేవంత్‌రెడ్డి సూచించారు. రాబోయే 30 ఏళ్ల తెలంగాణ భవిష్యత్తు ఏ దిశగా సాగాలన్నది పోలీసు అధికారుల పనితీరుపైనా ఆధారపడి ఉంటుందని అన్నారు. నిజాయితీగా విధులు నిర్వర్తిస్తూ బాధ్యతతో పనిచేయాలని, ప్రజల సమస్యలను ఓపికగా వినాలని సూచించారు. బాధితులను కూర్చోబెట్టి ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలని చెప్పారు. అధికారుల నిర్ణయాలు, వారి నుంచి వచ్చే అభిప్రాయాలు ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు. **మారుతున్న నేరాలపై అప్రమత్తంగా ఉండాలి..** ప్రస్తుతం నేరాల స్వరూపం వేగంగా మారుతోందని, ముఖ్యంగా సైబర్ నేరాల ద్వారా వ్యక్తులను ప్రత్యక్షంగా కలవకుండానే వారి ఆస్తులను దోచుకుంటున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ సరఫరా, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థలను తీసుకొచ్చిందని వివరించారు. డ్రగ్స్ నియంత్రణ కోసం ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసి కఠిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ, ట్రాఫిక్, డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాల కట్టడికి ఆధునిక విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు. **విదేశాల్లో శిక్షణకు అవకాశం..** పోలీసు అధికారులు వృత్తిపరమైన నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని సీఎం సూచించారు. అవసరమైతే నూతన డీఎస్పీలను మరింత అధ్యయనం, ఆధునిక పోలీసింగ్ విధానాల అవగాహన కోసం విదేశాలకు పంపిస్తామని ప్రకటించారు. విధి నిర్వహణతోపాటు శారీరక దృఢత్వంపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు శివధర్‌రెడ్డి, ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ వైస్ చైర్‌పర్సన్ శాంతకుమారి, డీజీపీ సీవీ ఆనంద్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కరవు రైతులకు అండగా బ్యాంకులు నిలవాలి

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు అవసరమైన ఆర్థిక సహకారం అందించి, వారు తదుపరి వ్యవసాయ సీజన్‌ను ఆత్మవిశ్వాసంతో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశానికి భట్టి విక్రమార్క హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని 365 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించామని, వీటిలో 111 మండలాల్లో తీవ్ర కరవు పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో బ్యాంకులు ప్రత్యేక చొరవ తీసుకుని రైతులకు అవసరమైన రుణ సదుపాయాలు కల్పించాలని కోరారు. **రబీ రుణాలు సకాలంలో అందించాలి** రబీ సీజన్‌కు సంబంధించి కొత్త పంట రుణాలను సకాలంలో మంజూరు చేయాలని భట్టి సూచించారు. రుణాల కోసం రైతులు బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని, అర్హత కలిగిన ప్రతి రైతుకు సులభంగా రుణాలు అందేలా చూడాలని ఆదేశించారు. తక్కువ నీటితో సాగు చేసుకునే పంటలకు ప్రాధాన్యతనిస్తూ రుణాలు మంజూరు చేయాలని, పంటల మార్పిడి, సూక్ష్మ సేద్యానికి ఆర్థిక సహకారం అందించాలని సూచించారు. **రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు** కరవు ప్రభావంతో వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున వారికి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కనీసం 10 నుంచి 15 శాతం రైతు కుటుంబాలకు అదనపు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. **ఇతర రంగాలకూ రుణాలు పెంచాలి** విద్య, గృహ రుణాల మంజూరులో బ్యాంకులు సానుకూలంగా వ్యవహరించాలని భట్టి విక్రమార్క సూచించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), మౌలిక సదుపాయాల రంగాలకు రుణాల పంపిణీని పెంచాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలకు అదనంగా రూ. 2 లక్షల వరకు రుణాలు అందించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఈ నెల 19వ తేదీ నాటికి రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు బ్యాంకర్లు అవసరమైన సహకారం అందించాలని కోరారు. కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ శాఖలు, బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

416 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

హక్కులు, కచ్చితమైన హద్దులు కల్పించడమేప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మంగళవారం సచివాలయంలో భూ రీసర్వే పురోగతిపై రెవెన్యూ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, రైతుల నుంచి వస్తున్న స్పందన, సాంకేతిక అంశాలు, సర్వే సిబ్బందికి ఎదురవుతున్న ఇబ్బందులపై చర్చించారు. సర్వేలో పాల్గొంటున్న సిబ్బందితో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకున్నారు. అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. **చిన్న తప్పిదానికీ తావివ్వొద్దు** భూ సర్వేలో జరిగే చిన్న పొరపాటు కూడా భవిష్యత్తులో పెద్ద భూ వివాదానికి కారణం కాకూడదని మంత్రి స్పష్టం చేశారు. సర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో సర్వే ప్రారంభించే ముందు సంబంధిత రెవెన్యూ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించాలని సూచించారు. రికార్డుల్లోని భూముల విస్తీర్ణం, యాజమాన్య హక్కులు, సరిహద్దులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలని తెలిపారు. **రైతులకు అభ్యంతరాల నమోదు అవకాశం** సర్వే పూర్తయిన వెంటనే సంబంధిత భూ యజమానులకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలని మంత్రి ఆదేశించారు. సర్వేలో నమోదైన వివరాలను పరిశీలించుకునేందుకు, భూముల విస్తీర్ణం, హద్దుల విషయంలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేసేందుకు తగిన అవకాశం కల్పించాలని చెప్పారు. రైతులు తెలిపే అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలన్నారు. సర్వే విధానం, నోటీసుల జారీ, అభ్యంతరాల నమోదు, పరిష్కారంపై గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. **భూదార్ కేటాయింపులు వేగవంతం చేయాలి** సర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపునిచ్చే భూదార్ నంబర్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని పొంగులేటి ఆదేశించారు. భూముల హక్కులు, విస్తీర్ణం, సరిహద్దులకు సంబంధించిన వివరాలతో స్పష్టమైన రికార్డులు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. భూ యజమానుల ప్రయోజనాలు, వారి అభిప్రాయాలు, సూచనలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. భూ యజమానులకు పూర్తి సంతృప్తి కలిగేలా సర్వే నిర్వహించడమే విజయానికి ప్రామాణికమని పేర్కొన్నారు.

13న బంగాళాఖాతంలో అల్పపీడనం

తొలి అక్షరం/అమరావతి,నవంబర్ 10: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ అల్పపీడనం వాయవ్య దిశగా పయనించి, తదుపరి 24 గంటల్లో మరింత బలపడి తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశముందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. వాయవ్య ఉత్తరప్రదేశ్ నుంచి మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా మీదుగా ఉత్తర కోస్తాంధ్ర వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని పేర్కొంది. దీని ప్రభావంతో బుధవారం కోస్తాంధ్ర, యానాం, రాయల సీమ ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొనే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

చంద్రబాబు కేసులపై హైకోర్టు తీర్పు రిజర్వ్

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ వ్యాజ్యాలపై ఇరుపక్షాల వాదనలు పూర్తికావడంతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబుతో పాటు పలువురిపై ఇన్నర్ రింగ్ రోడ్డు, స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్ గ్రిడ్, రాజధాని అసైన్డ్ భూములు, మద్యం విధానం, ఉచిత ఇసుక విధానాలకు సంబంధించి సీఐడీ కేసులు నమోదు చేసింది. వీటి దర్యాప్తును సీబీఐ, ఈడీకి బదిలీ చేయాలని కోరుతూ బాలగంగాధర తిలక్ 2024లో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. స్కిల్ కేసును సీబీఐకి అప్పగించాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ కూడా మరో పిటిషన్ వేశారు. దర్యాప్తులో స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను తిరిగి ఇవ్వకుండా విజయవాడ ఏసీబీ కోర్టును ఆదేశించాలని అనుబంధ పిటిషన్ కూడా దాఖలైంది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది.

టర్కీ ఉక్కు కర్మాగారంలో ఘోర ప్రమాదం..

తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 10:

టర్కీలోని ఇజ్మీర్ ప్రావిన్స్ అలియాగా ప్రాంతంలో ఉన్న హబాస్ ఉక్కు కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో 16 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో 13 మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కర్మాగారంలో మరమ్మతు పనులు జరుగుతున్న సమయంలో భారీ క్రేన్ కొలిమిపై పడటంతో పేలుడు సంభవించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. పేలుడు ధాటికి మంటలు వ్యాపించడంతో సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించాయి. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ ఘటనపై న్యాయ, పరిపాలనా విచారణకు ఆదేశించారు.

భారత్ సమ్మిట్‌కు రాహుల్ గాంధీకి ఆహ్వానం

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 10:

హైదరాబాద్‌లో నిర్వహించనున్న భారత్ సమ్మిట్‌కు హాజరుకావాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆహ్వానించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీని కలిసిన ఆయన.. ఈ నెల 12 నుంచి 14 వరకు హైటెక్స్‌లో జరగనున్న మూడు రోజుల సదస్సు వివరాలను తెలియజేసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ఈ సదస్సుకు సుమారు 100 దేశాల ప్రతినిధులను ఆహ్వానించారు. దాదాపు 450 మంది ప్రముఖులు, కేంద్ర మంత్రులు, ఎంపీలు పాల్గొననున్నారు. అంతర్జాతీయ సంబంధాలు, దేశాల మధ్య సహకారం, ఆర్థికాభివృద్ధి వంటి కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి. సదస్సులో ఏదో ఒక రోజు రాహుల్ గాంధీ పాల్గొనే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

శిక్షణార్థులకు అంతర్జాతీయ వసతి సదుపాయం

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్నేషనల్ హాస్టల్‌ను కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుంచి శిక్షణ కోసం వచ్చే వారికి నాణ్యమైన వసతి సదుపాయాలు అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని అన్నారు. శిక్షణార్థులు వసతి సమస్యలపై ఆందోళన చెందకుండా, ప్రశాంతమైన వాతావరణంలో తమ విద్య, శిక్షణపై పూర్తిస్థాయిలో దృష్టి సారించేలా ఈ హాస్టల్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వసతి సదుపాయాలను కల్పించడం అభినందనీయమన్నారు. జీఎస్ఐ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో శిక్షణ పొందేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఈ హాస్టల్ ఎంతో ప్రయోజనకరంగా ఉండనుంది. శిక్షణా సంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధి, నాణ్యమైన వసతి కల్పన ద్వారా శిక్షణార్థులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, జీఎస్ఐ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

12 నుంచి కొత్త పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

- **రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల మందికి లబ్ధి**
- **18వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు.. పెండింగ్ దరఖాస్తుల పరిశీలనకు కలెక్టర్లకు ఆదేశాలు**

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 10: తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా మంజూరైన చేయూత సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4.5 లక్షల మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలన, అర్హుల ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి దివ్య దేవరాజన్ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి జాప్యం లేకుండా మంజూరు పత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలకు సంబంధిత ఎమ్మెల్యేలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు. **ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు** పింఛన్ల పంపిణీ కార్యక్రమాల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, దరఖాస్తుదారుల అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించాలని అధికారులకు సూచించారు. పెండింగ్ దరఖాస్తుల పరిశీలనను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులో ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా ఎంపికైన లబ్ధిదారుల్లో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులు తదితర వర్గాలకు చెందినవారు ఉన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్ల నగదును ఈ నెల నుంచే లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

కర్నె రవి చరణ్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్స్ పంపిణీ

- సేవా కార్యక్రమంతో జన్మదిన వేడుకలు నిర్వహించిన కేఆర్‌సీ ఫౌండేషన్ సభ్యులు





తొలి అక్షరం/చౌటుప్పల్: నవంబర్ 10: మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తనయుడు, కేఆర్‌సీ ఫౌండేషన్ చైర్మన్ కర్నె రవి చరణ్ జన్మదినం సందర్భంగా చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు.జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంతో జరుపుకోవాలనే ఉద్దేశంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్స్ అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ కేఆర్‌సీ ఫౌండేషన్ సభ్యులు ఊదరి రాకేష్, పగిళ్ల నరేష్, చింతపల్లి వినయ్ రెడ్డి, వికాస్, భాస్కర్, విఘ్నేష్, సందీప్, అత్తు, నాని, జున్ను, చరణ్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించకుండా ఇందిరమ్మ ఇళ్ల సంబరాలెందుకు?

- పూర్తి చేసిన ఇళ్లకు వెంటనే నిధులు విడుదల చేయాలి: గిర్మటి నిరంజన్ గౌడ్



తొలి అక్షరం/చౌటుప్పల్: నవంబర్ 10:ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న పేదలకు బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వం జాప్యం చేయడంపై చౌటుప్పల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గిర్మటి నిరంజన్ గౌడ్ విమర్శలు చేశారు. అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు నిధులు విడుదల చేయకుండా ఇందిరమ్మ ఇళ్ల సంబరాలు నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు.పేదలు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నా, బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. అప్పులకు వడ్డీలు పెరుగుతున్నా ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ప్రచారానికి ప్రాధాన్యత ఇవ్వడం మానుకుని, ఇళ్లు పూర్తి చేసిన అర్హులైన లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని గిర్మటి నిరంజన్ గౌడ్ డిమాండ్ చేశారు. సంబరాల కంటే పేదల సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

చీదురాల సత్యనారాయణ మృతికి కాంగ్రెస్ నాయకుల సంతాపం

- పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు





తొలి అక్షరం/నెక్కొండ నవంబర్ 10:వరంగల్ జిల్లా నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చీదురాల సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన పార్థివదేహానికి నర్సంపేట నియోజకవర్గ టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లావుడ్యా తిరుమల్, కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, ఇదునూరి సాయికృష్ణ, గరికపాటి హన్మంతరావు, రావుల మహిపాల్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

నెక్కొండ నూతన ఎస్సైకి ఘన సత్కారం



తొలి అక్షరం/నెక్కొండ నవంబర్ 10:వరంగల్ జిల్లా నెక్కొండ పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన జె. శ్రావణ్ కుమార్‌ను ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి ఈదునూరి యాకయ్య మాదిగ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు వడ్డూరి కుమార్, వార్డు సభ్యులు కందిక ఉమా వెంకన్న, జంగిలి భాస్కర్, మాసాని యాకూబ్, జిల్లా కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించిన ఆర్యవైశ్య ప్రముఖులు



తొలి అక్షరం/నెక్కొండ నవంబర్ 10:వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి చిదురాల సత్యనారాయణ మృతి పట్ల ఆర్యవైశ్య ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తాటిపల్లి శివకుమార్, నెక్కొండ పీఏసీఎస్ మాజీ చైర్మన్ మారం రాము, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దొడ్డ విజయ్, దొడ్డ నగేష్, నంగునూరి కృష్ణమూర్తి, నంగునూరు శివయ్య, నంగునూరు భాస్కర్, పుల్లూరి శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందించాలి

లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా చేపట్టాలి

రెండు పడక గదుల ఇళ్ల ను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్





తొలి అక్షరం /ఖమ్మం, జిల్లా ప్రతినిధి నవంబర్ -10: ఖమ్మం జిల్లాలో వివిధ దశల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన రెండు పడక గదుల ఇళ్ల ను యథాస్థితిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందజేతకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం క్షేత్రస్థాయిలో పలు మండలాల్లోని రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం గ్రామంలో 30, సింగిరెడ్డిపాలెం గ్రామంలో 48, శంకరగిరి తండా గ్రామంలో 30, కూసుమంచి మండలం మల్లెపల్లి గ్రామంలో 16, ఖమ్మం అర్బన్ మండలం దంసలాపురంలో 192 అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణాలను ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో అదే స్థాయి నుంచి పూర్తి చేసుకునేందుకు అంగీకారంతో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి వారికి కేటాయించవలసిందిగా అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తిగా పారదర్శకమైన విధానాన్ని అవలంబించాలని తెలిపారు. ఇళ్ల సముదాయాల వద్ద విద్యుత్, శానిటరీ, త్రాగునీటి సరఫరా తదితర మౌళిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, తహశీల్దార్ లు రాంప్రసాద్, సైదులు, విజయేందర్ రెడ్డి, జయచంద్ర, హౌజింగ్ డీఈ కె. జగ్రామ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల జీవితాల్లో అక్షరజ్యోతులు వెలిగించిన గురువు హరికుమార్

16 ఏళ్లకే ఉపాధ్యాయ వృత్తిలోకి..

నిరుపేదలకు ఉచిత విద్యాబోధన

గురువు అంత్యక్రియలు నిర్వహించిన శిష్యులు..

ఆశయాలను కొనసాగిస్తున్న భార్య శ్వేత









తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ, నవంబర్ 10:పర్వతగిరి: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో జీవితాన్ని అంకితం చేసిన ఉపాధ్యాయుడు ఎర్రబెల్లి హరికుమార్ విద్యార్థుల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. కేవలం 16 ఏళ్ల వయసులోనే ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టిన ఆయన, 2016లో పర్వతగిరిలో విశ్వజనిత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను స్థాపించారు. ఆర్థిక స్థోమత లేని విద్యార్థులకు ఉచితంగా విద్యాబోధన చేస్తూ ఎందరో పేద పిల్లల జీవితాల్లో వెలుగులు నింపారు.విద్యారంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా 2018లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. టీఆర్ఎస్ఎంఏ వర్ధన్నపేట జోన్ అధ్యక్షుడిగా ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేశారు. ఆయన వద్ద చదువుకున్న పలువురు విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగులుగా, మరికొందరు భారత సైన్యంలో పనిచేస్తూ దేశానికి సేవలందిస్తున్నారు.ఇటీవల బైక్‌పై వెళ్తుండగా చెట్టు కూలిపడిన ప్రమాదంలో హరికుమార్ అకాల మరణం చెందడం పర్వతగిరిలో విషాదం నింపింది. గురువు మరణవార్త విన్న శిష్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఆయనపై తమకున్న అభిమానానికి నిదర్శనంగా విద్యార్థులే ముందుకొచ్చి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.**భర్త ఆశయాలను కొనసాగిస్తున్న భార్య**హరికుమార్ భార్య శ్వేత ప్రస్తుతం ఆయన స్థాపించిన విశ్వజనిత్ పాఠశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పేద పిల్లలకు ఉన్నత విద్య అందించాలన్న భర్త ఆశయాన్ని కొనసాగిస్తానని ఆమె తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో ఏ విద్యార్థీ చదువుకు దూరం కాకూడదన్న ఆయన కలను నెరవేర్చడమే తన లక్ష్యమన్నారు. భౌతికంగా దూరమైనా, విద్యార్థుల ప్రేమాభిమానాల్లో హరికుమార్ చిరస్థాయిగా నిలిచిపోయారు.

క్షేత్రస్థాయి భూమే భూ లీ-సర్వేకు ప్రామాణికం



- రైతుల సమక్షంలో పారదర్శకంగా సర్వే నిర్వహించాలి

- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి: కలెక్టర్ దివాకర టి.ఎస్.



తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి, నవంబర్ 10: భూ రీ-సర్వేలో క్షేత్రస్థాయిలో ఉన్న భూమినే ప్రామాణికంగా తీసుకొని, వాస్తవ వివరాలను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి రెవెన్యూ గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాల్వగట్లపై ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ సర్వే పనులను తనిఖీ చేశారు.రోవర్, ట్యాబ్ వంటి ఆధునిక పరికరాలతో నిర్వహిస్తున్న డిజిటల్ సర్వే విధానాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. పట్టాదారు పాస్‌బుక్‌లలోని విస్తీర్ణం, క్షేత్రస్థాయిలో ఉన్న భూమి, హద్దులు, పాత రెవెన్యూ రికార్డులను సరిపోల్చి ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలని సూచించారు.రైతుల సమక్షంలోనే కొలతలు నిర్వహించి, అవసరమైన చోట పంచనామా, ఫొటోలతో సహా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఏ ఒక్క అర్హుడి భూమి వివరాలు కూడా తప్పిపోకుండా పారదర్శకంగా సర్వే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.రీ-సర్వే సమయంలో రైతులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండి, పట్టాదారు పాస్‌బుక్‌లు, పాత పహాణీలు, రిజిస్ట్రేషన్ పత్రాలు తదితర ఆధారాలను అధికారులకు అందించి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ ప్రక్రియతో భూ వివాదాలు తగ్గి, భూ రికార్డుల్లో స్పష్టత వస్తుందని తెలిపారు. ఖమ్మం రూరల్ తహసీల్దార్ వినయేందర్ రెడ్డి, సర్వే సిబ్బంది, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నవంబర్ నెలాఖరుకు వెలుగుమట్ల మోడల్ కాలనీ పనులు పూర్తి చేయాలి

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

- అంతర్గత రహదారులు, డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ దివాకర టి.ఎస్.



తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి, నవంబర్ 10: వెలుగుమట్ల మోడల్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పాటు మౌలిక సదుపాయాల పనులను నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. ఖమ్మం నగరపాలక సంస్థ 15వ డివిజన్ పరిధిలోని కాలనీలో నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పురోగతిపై సమీక్షించారు.కాలనీలో మొత్తం 300 ఇళ్లు మంజూరు కాగా, 22 ఇళ్లు ఫినిషింగ్ దశలో, 119 ఇళ్లకు స్లాబ్‌లు పూర్తయ్యాయి. మరో 59 ఇళ్లు రూఫ్ లెవల్‌లో, 98 ఇళ్లు బేస్‌మెంట్ దశలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 205 ఇళ్లకు నిర్మాణ దశల వారీగా బిల్లులు చెల్లించామని, 133 మంది లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు అందించామని పేర్కొన్నారు.బస్తీ దవాఖానా, ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. అంతర్గత సీసీ రహదారులు, డ్రైనేజీ పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.తనిఖీలో హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, డీఈ కె. జగ్రామ్, మున్సిపల్ డీఈ నవ్యజ్యోతి, తహసీల్దార్ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వి.డి.ఓ.స్ కాలనీ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో రెండవ ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రం ప్రారంభం..: జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్



తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి, నవంబర్ 10: స్థానిక గాంధీ చౌక్ వద్ద గల చాంబర్ ఆఫ్ కామర్స్ లో విజయవంతంగా నడుస్తున్న ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రానికి కొనసాగింపుగా, వినియోగదారులకు నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన సరసమైన ధరలకు అందుబాటులో ఉంచేందుకు ఖమ్మం పట్టణంలోని వి.డి.ఓ.స్ కాలనీలో గల ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లో మంగళవారం 2వ ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాన్ని ప్రారంభించినట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రంలో వివిధ రకాల బియ్యం ధరలను నిర్ణయించడం జరిగిందని, బిపిటి/కెఎన్ఎమ్ రకం బియ్యం కిలో రూ. 66, ఆర్ఎన్ఆర్/తెలంగాణ సోనా రకం బియ్యం కిలో రూ. 74, హెచ్ఎంటి/జిఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ. 79 చొప్పున విక్రయించబడతాయని అన్నారు. మార్కెట్ కు వచ్చిన వినియోగదారులు బియ్యం కొనుగోలుకు విశేషంగా ముందుకు వచ్చారని, తమ ప్రాంతంలోనే నాణ్యమైన బియ్యం ప్రభుత్వం నిర్ణయించిన సరసమైన ధరలకు లభించడం పట్ల ప్రజలు సంతోషం, సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు.ఖమ్మం పట్టణ, పరిసర ప్రాంతాల వినియోగదారులు ఈ మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి ఆ ప్రకటనలో కోరారు.

ఘనంగా ముగిసిన జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్





తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి, నవంబర్ 10: భారత ప్రభుత్వ యువజన సర్వీసులు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ, మై భారత్ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల నందు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డిస్టిక్ యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ టి. సునీల్ రెడ్డి, ఎంప్లాయ్మెంట్ ఆఫీసర్ ఎన్. మాధవి, పాల్గొని ముందుగా వీరు వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సునీల్ రెడ్డి మాట్లాడుతూ దేశ యువత మాదకద్రవ్యాల (డ్రగ్స్) బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎన్. మాధవి మాట్లాడుతూ యువత తమ ఆలోచనలు, అభిప్రాయాలను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తపరిచేందుకు ఈ కార్యక్రమం ఒక మంచి వేదికగా నిలుస్తుందని, చెడు వ్యాసాలకు దూరంగా ఉండాలని ఒక అడుగు ముందు ఉండి బాగా చదువుకోవాలని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఏ.పి.జె. అబ్దుల్ కలామ్ మరియు స్వామి వివేకానంద వారి పుస్తకాలు చదివితే మీ భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఎదిగే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొని వికసిత్ భారత్ఏ2047: 2047 నాటికి భారతదేశాన్ని తీర్చిదిద్దాలంటే, యువత ఆరోగ్యంగా మరియు డ్రగ్స్ రహితంగా ఉండటం అత్యంత కీలకమని చదువు పట్ల ఆసక్తి ఉండాలని చెప్పారు. జిల్లాస్థాయి పోటీలలో ఎండి. నదియా అర్షిన్, కె. వెన్నెల, ఎండి. ఆయేషా తహుర, ఆయేషా తహురిన్, పి. లక్ష్మీ ప్రియా మొదటి ఐదు స్థానాల్లో నిలిచారు. జిల్లాస్థాయిలో మొదటి మూడు స్థానాలలో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయికి ఎన్నికవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ. రమణ రావు, మేరా యువ భారత్ డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ ఎం. రాంబాబు, ఎన్.ఎస్.ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. శ్రీనివాస రావు, ఆల్ ఇండియా రేడియో & డిడి న్యూస్ జిల్లా కరస్పాండెంట్ బి. రమేష్, తెలుగు ప్రొఫెసర్ డా,, ఎస్. స్పందన, అజయ్ కుమార్, మై భారత్ అకౌంట్స్ అధికారి కే. భానుచందర్ మరియు ఎన్వోవి భార్గవి, శిరీష, సుమయ్య, రాగసుధ పాల్గొన్నారు.

విజయ డైరీలో పాలు, పెరుగు ప్యాకింగ్ పునఃప్రారంభించే వరకు పోరాటం

- **డైరీ ఎండీ వెంటనే చర్చలకు పిలవాలి**
- **సమస్య పరిష్కరించకపోతే రాష్ట్రస్థాయిలో ఉద్యమం: బీజేపీ నేత ధనియాకుల వెంకటనారాయణ**




తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి, నవంబర్ 10:ఖమ్మం విజయ డైరీలో పాలు, పెరుగు ప్యాకింగ్‌ను తిరిగి ప్రారంభించే వరకు పోరాటం కొనసాగిస్తామని బీజేపీ టూ టౌన్ అధ్యక్షుడు ధనియాకుల వెంకటనారాయణ స్పష్టం చేశారు. ప్యాకింగ్ పునఃప్రారంభించాలని గతంలో డైరీ ఎదుట ధర్నా నిర్వహించినా అధికారులు స్పందించలేదని తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.దాదాపు పదేళ్లుగా వివిధ పేర్లతో ఒకరికే డిస్ట్రిబ్యూషన్ బాధ్యతలు అప్పగిస్తున్నారని, దీనివల్ల సంస్థకు, వేలాది కుటుంబాలకు నష్టం జరుగుతున్నా డైరీ ఎండీ పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఎండీ వెంటనే చర్చలకు పిలిచి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం స్పందించి డైరీలో పాలు, పెరుగు ప్యాకింగ్‌ను పూర్తి స్థాయిలో పునఃప్రారంభించాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే బీజేపీ రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి రాష్ట్రస్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ప్యాకింగ్ ప్రారంభమయ్యే వరకు వెనక్కి తగ్గేది లేదని వెంకటనారాయణ స్పష్టం చేశారు.

కోటి దీపోత్సవానికి కేశమోని శ్రీనివాస్ రూ.5 లక్షల విరాళం

అయ్యప్ప మహాపడి పూజకు బీసీ సేన జిల్లా అధ్యక్షుడి భారీ విరాళం

ఆధ్యాత్మిక సేవలో సదర్ శ్రీను.. కోటి దీపోత్సవానికి రూ.5 లక్షల సాయం





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 10: ఆధ్యాత్మిక సేవలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు చాటుకుంటూ బీసీ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కేశమోని శ్రీనివాస్ (సదర్ శ్రీను) కోటి దీపోత్సవానికి రూ.5 లక్షల భారీ విరాళం అందజేశారు. భక్తిభావంతో నిర్వహించే కోటి దీపోత్సవంలో భాగంగా చివరి రోజు జరగనున్న అయ్యప్ప స్వామి మహాపడి పూజకు ఆయన ఈ ఆర్థిక సహాయాన్ని ప్రకటించడం ప్రత్యేకంగా నిలిచింది.**మహాపడి పూజలో అరుదైన అవకాశం**అయ్యప్ప స్వామి మహాపడి పూజలో పడి ముట్టించి దీపం వెలిగించడం భక్తులకు ఎంతో పవిత్రమైన ఘట్టం. ఈ నేపథ్యంలో శ్రీనివాస్ అందించిన విరాళానికి గుర్తింపుగా ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు ఆయనకు మహాపడి పూజలో పడి ముట్టించి దీపం వెలిగించే అరుదైన అవకాశాన్ని కల్పించారు. స్వామివారి సన్నిధిలో ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. **దాతృత్వానికి నిర్వాహకుల అభినందనలు**కోటి దీపోత్సవం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు దాతల సహకారం ఎంతో కీలకమని కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీ కేశమోని శ్రీనివాస్ అందించిన రూ.5 లక్షల విరాళం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయన సేవాభావాన్ని అభినందించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆర్థికంగా అండగా నిలవడం సమాజంలో భక్తి, సేవాభావాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు.బీసీ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా సామాజిక కార్యక్రమాల్లోనూ చురుకుగా ఉంటున్న శ్రీనివాస్ ఆధ్యాత్మిక కార్యక్రమానికి భారీ విరాళం అందించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. అయ్యప్ప స్వామి దివ్య ఆశీస్సులు ఆయన కుటుంబంపై ఎల్లవేళలా ఉండాలని, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు ప్రసాదించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

త్రిశక్తి పీఠం అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 10: నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం బిజ్వార్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ అంబా త్రయ క్షేత్రంలో త్రిశక్తి పీఠం అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, క్షేత్ర ప్రాముఖ్యతను తెలుసుకున్నారు.అనంతరం డా. శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ గురువును కలిసి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట మండలం కుంకుడు పాముల కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నాతి పరశురాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యుల హక్కుల సాధనే లక్ష్యం: శ్రీకాంత్ యాదవ్

- 153 గ్రామాల వార్డు సభ్యుల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ

- షాద్‌నగర్‌లో ఫోరమ్ కార్యాలయం ఏర్పాటు చేస్తా



తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 10: వార్డు సభ్యుల హక్కులు, గౌరవం, సంక్షేమం కోసం పార్టీలకు అతీతంగా ఐక్యంగా పోరాడాలని తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్స్ ఫోరమ్ షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు మామిడిపల్లి శ్రీకాంత్ యాదవ్ పిలుపునిచ్చారు. ఫరూక్‌నగర్ మండలంలో నిర్వహించిన వార్డు సభ్యుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం కావడంతో అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ఉన్న 153 గ్రామాల వార్డు సభ్యులంతా ఒకే వేదికపైకి రావాలని కోరారు. వార్డు సభ్యులకు అండగా ఉంటానని, ఫోరమ్ సభ్యుడు మరణిస్తే వారి కుటుంబానికి వ్యక్తిగతంగా రూ.5 వేల ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. షాద్‌నగర్‌లో సొంత నిధులతో ఫోరమ్ కార్యాలయం ఏర్పాటు చేస్తానని ప్రకటించారు.సమావేశంలో కిషన్‌నగర్ మాజీ వార్డు సభ్యుడు మాదే శ్రీనివాస్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.



కరువు పోవాలంటే ప్రాజెక్టులు పూర్తికావాలి

- పాలమూరు నీటి హక్కుల కోసం విద్యార్థుల చైతన్య పోరు





తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 10: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయడంతో పాటు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం ద్వారా ఈ ప్రాంత రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన “లక్షలాది సంతకాల సేకరణ మహా ఉద్యమం“ ఉధృతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని బిఏఎం డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలమూరు ప్రాంత సాగునీటి హక్కుల సాధన కోసం సాగుతున్న ఈ ఉద్యమానికి విద్యార్థి లోకం తమ సంతకాల ద్వారా సంపూర్ణ మద్దతు ప్రకటించింది.ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ చైర్మన్ మిద్దెల సత్యనారాయణ, కోఆర్డినేటర్ కర్ణకోట రవీంద్రనాథ్, పసుపుల ప్రశాంత్ మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ‘నీళ్లు, నిధులు, నియామకాలు‘ అనే నినాదం ప్రధాన భూమిక పోషించిందని గుర్తుచేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నప్పటికీ, ఉమ్మడి పాలమూరు జిల్లాలో అనేక సాగునీటి ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉండటం తీవ్ర ఆందోళనకరమని పేర్కొన్నారు.సాగునీరు లేక రైతాంగం, ఉపాధి అవకాశాలు లేక యువత వలసలు వెళ్లే పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపించాలంటే పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. ముఖ్యంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టి పాలమూరు ప్రజల నీటి అవసరాలను తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను లక్షలాది సంతకాల రూపంలో నివేదికగా మలిచి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఇది కేవలం ఒక సంతకాల సేకరణ కార్యక్రమం మాత్రమే కాదని, పాలమూరు ప్రజల నీటి హక్కులు, భవిష్యత్తు తరాల బాగు కోసం సాగుతున్న ప్రజా ఉద్యమమని నేతలు పునరుద్ఘాటించారు.

తండ్రి అంత్యక్రియలు నిర్వహించిన ఆడబిడ్డను చూసి చలించిన దైద రవీందర్

● బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 10:కట్టంగూరు మండలం బొల్లెపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త తాటి వెంకన్న మృతి చెందడంతో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. వెంకన్న భౌతికకాయానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.చిన్న వయసులోనే తండ్రికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించిన కుమార్తెను చూసి ఆయన భావోద్వేగానికి గురయ్యారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం కుటుంబానికి తక్షణ సాయంగా రూ.5,000 అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ నాయకులు గార్లపాటి రవీందర్ రెడ్డి, సర్పంచ్ వల్లపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ జంజిరాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా వంగాల వెంకన్న గౌడ్



తొలి అక్షరం/వలిగొండ నవంబర్ 10: మండల పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు వంగాల వెంకన్న గౌడ్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు.కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం ఎన్ఎస్ యుఐ లో పనిచేస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక సార్లు లాఠీ దెబ్బలు, జైలు జీవితం అనుభవించిన నికార్సయిన ఉద్యమకారుడిగా ఆయనకు గుర్తింపు ఉంది.ఉద్యమం నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉంటూ, పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. ఆయన సేవలను, నిబద్ధతను గుర్తించిన పార్టీ అధిష్టానం ఆయనను టీపీసీసీ అధికార ప్రతినిధిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ఈ సందర్భంగా వంగాల వెంకన్న గౌడ్ మాట్లాడుతూ... తనకు ఈ బాధ్యత అప్పగించిన ఏఐసీసీ, టీపీసీసీ నాయకత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ విధానాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని, అధికార ప్రతినిధిగా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తానని అన్నారు.ఆయన నియామకం పట్ల వలిగొండ మండల కాంగ్రెస్ నాయకులు, ఉద్యమకారులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి: ఎంపీడీఓ, జలంధర్ రెడ్డి



తొలి అక్షరం/వలిగొండ, నవంబర్, 10: మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జి. జలంధర్ రెడ్డి సుంకిశాల, పులిగిల్ల, కేర్చిపల్లి, వెల్వర్తి గ్రామ పంచాయతీలను సందర్శించి, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, నిర్ణీత గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ఎలాంటి జాప్యం చేయకుండా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని తెలిపారు.అనంతరం ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలను సందర్శించి సిబ్బంది హాజరు పట్టికలు, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ సక్రమంగా నిర్వహించాలని, విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.

ఇంద్రపాలనగరంలో నేడు ఓపెన్ జిమ్ ప్రారంభం

- కోరమండల్ కంపెనీ సహకారంతో ఏర్పాటు

- యువత చిరకాల వాంఛ నెరవేర్చిన సర్పంచ్ గర్ధాస్ విక్రమ్



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 10: ఇంద్రపాలనగర గ్రామ యువత చిరకాల వాంఛ అయిన ఓపెన్ జిమ్ ప్రారంభానికి సిద్ధమైంది. గ్రామ సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ ప్రత్యేక చొరవతో కోరమండల్ కంపెనీ సహకారంతో గ్రామ హైస్కూల్ ఆవరణలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు.ఈ నెల 11న ఉదయం 10 గంటలకు జిమ్‌ను ప్రారంభించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. యువతతో పాటు మార్నింగ్ వాకర్లకు ఈ జిమ్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రోమోర్ సంస్థ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో ప్రారంభోత్సవానికి ప్రజాప్రతినిధులు, రైతులు, యువత, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

గురుకులంలో విద్యార్థులతో గ్యాస్ సిలిండర్ల మోత!

చదువుకోవాల్సిన చేతులతోనే ద

బరువులు మోయిస్తున్నారా..?

ఏన్కూర్ తెలంగాణ గురుకుల పాఠశాలలో

వెలుగులోకి వచ్చిన దృశ్యాలు..

విద్యార్థుల భద్రతపై ఆందోళన

విద్యార్థుల చేత గ్యాస్ సిలిండర్ల

తరలింపు.. బాధ్యత ఎవరిది?

సంబంధిత అధికారులు స్పందించి విచారణ

చేపట్టాలని తల్లిదండ్రుల డిమాండ్



తొలి అక్షరం/ఏన్కూర్ నవంబర్ 10:విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, భోజన సదుపాయాలు కల్పించాల్సిన గురుకుల పాఠశాలలో విద్యార్థులతోనే బరువైన గ్యాస్ సిలిండర్లను మోయిస్తున్న ఘటన చర్చనీయాంశంగా మారింది. ఖమ్మం జిల్లా ఏన్కూర్‌లోని తెలంగాణ గురుకుల పాఠశాలలో హాస్టల్ విద్యార్థులు గ్యాస్ సిలిండర్లను ఒకచోటు నుంచి మరోచోటుకు తరలిస్తున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం విద్యార్థుల భద్రతపై పలు ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.పాఠశాలలో చదువుకోవాల్సిన విద్యార్థులు గ్యాస్ సిలిండర్ల వంటి బరువైన వస్తువులను మోయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యార్థుల చేత ఇలాంటి పనులు చేయించడం వెనుక కారణాలేంటి? గ్యాస్ సిలిండర్లను తరలించేందుకు అవసరమైన సిబ్బంది అందుబాటులో లేరా? లేక సిబ్బంది చేయాల్సిన పనులను విద్యార్థులతో చేయిస్తున్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.గ్యాస్ సిలిండర్ల తరలింపు సాధారణ పని కాదు. ఏమాత్రం అజాగ్రత్త జరిగినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన గురుకుల యాజమాన్యం ఇలాంటి విషయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల చేత బరువైన వస్తువులు మోయించడం ఎంతవరకు సమంజసమన్నది ప్రశ్నార్థకంగా మారింది.ఇప్పటికే రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతున్న నేపథ్యంలో, ఏన్కూర్ గురుకులంలో వెలుగుచూసిన ఈ దృశ్యాలు అధికారుల పర్యవేక్షణ తీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. పాఠశాల నిర్వహణను పర్యవేక్షించాల్సిన అధికారులు ఇలాంటి ఘటనలను గుర్తిస్తున్నారా? విద్యార్థుల భద్రత విషయంలో యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకుంటోంది? అన్నది తేలాల్సి ఉంది.జిల్లా గురుకుల సంక్షేమ అధికారులు తక్షణమే స్పందించి ఘటనపై విచారణ జరిపి, విద్యార్థులతో గ్యాస్ సిలిండర్లు ఎందుకు మోయించాల్సి వచ్చిందో వెల్లడించాలని తల్లిదండ్రులు, విద్యార్థుల తల్లిదండ్రుల వర్గాలు కోరుతున్నారు. విద్యార్థుల చేతుల్లో పుస్తకాలు ఉండాల్సిన చోట గ్యాస్ సిలిండర్లు కనిపించడం విద్యావ్యవస్థలో బాధ్యతాయుత నిర్వహణపై ఆలోచించాల్సిన పరిస్థితిని కల్పిస్తోంది.

రాష్ట్రస్థాయి క్రీడ పోటీలకు ఆలేరు విద్యార్థులు



తొలి అక్షరం/నెల్లికుదురు నవంబర్ 10: నెల్లికుదురు మండలంఆలేరు ఉన్నత పాఠశాలలో చదువుతున్న యశ్వంత్ మరియు గణేష్ తేజ్ ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలలో ఎంపికయ్యారని యశ్వంత్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ పోటీలలో ఎంపిక పోటీలో పాల్గొని ఎంపికయ్యారని ఈనెల 13 నుండి నిజామాబాద్ జిల్లాలో నుండి జరుగునున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో పాల్గొంటారని మరియు గణేష్ తేజ్ ఈనెల 12న జనగాం జిల్లాలో జరగనున్న ఎస్ .జి.ఎఫ్. రాష్ట్రస్థాయి సెపక్ తాక్రా 14 విభాగంలో ఉమ్మడి వరంగల్ జిల్లా తరపున పాల్గొనబోతున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు మండల విద్యాశాఖ అధికారి రామదాసు తెలిపారు. వీరి ఎంపిక పట్ల విద్యార్థులను మరియు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ను పాఠశాల ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు విద్యార్థులను అభినందించారు.

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

- విద్యార్థి చదువుకు రూ.5,100 ఆర్థిక సహాయం అందజేత





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 10: తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరావతి లక్ష్మీనారాయణ గుప్త జన్మదిన వేడుకలు ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి ఆర్యవైశ్య మహాసభ నాయకులు, ప్రతినిధులు పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొండ్లె మల్లికార్జున్ గుప్త, గణేష్ గుప్త, చింతల రవికుమార్ గుప్త, ఆగిరి వెంకటేశం గుప్త, ఊరే లక్ష్మణ్ గుప్త, అర్థం లక్ష్మయ్య గుప్త తదితరులు పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గందే సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లాకంటి కిరణ్, కోశాధికారి వనపర్తి బద్రీనాథ్, యువజన సంఘం కార్యదర్శి నీల రవీందర్‌తో పాటు పలువురు మండల అధ్యక్షులు, నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆర్యవైశ్య విద్యార్థి చదువుకు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గందే సురేష్ రూ.5,100 ఆర్థిక సహాయం అందజేశారు. విద్యార్థుల ఉన్నత చదువులకు సహకారం అందించడం అభినందనీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆత్మీయ వాతావరణంలో వేడుకలు ఆనందోత్సాహాల మధ్య కొనసాగాయి.

రాష్ట్ర కుమ్మర సంఘం మండల

హడాక్ కమిటీ ఎన్నిక



తొలి అక్షరం/నెల్లికుదురు నవంబర్ 10: నెల్లికుదురు మండలం కేంద్రంలో శాంతినికేతన్ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నెల్లికుదురు మండల హడాక్ కమిటీ జిల్లా అధ్యక్షులు అలవాలా శ్రీనివాస్, జిల్లా హడాక్ కమిటీ కన్వీనర్ అలవాలా ఉపేందర్, కో కన్వీనర్ సముద్రల సోమయ్య, కొత్తపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల హడాక్ కమిటి కన్వీనర్ గా రుద్రరావు రవికుమార్, ప్రధాన కార్యదర్శి గా పోతుగంటి శ్రీనివాస్, కమిటీ సభ్యులు గా పోతుగంటి రవి, వాడ్కాపురం నర్సయ్య, మల్యాల ఐలయ్య, రుద్రరావు ఉప్పలయ్య, పాలాభిందేలా మహేష్ ల ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం లో మల్యాల నర్సయ్య, సముద్రల వెంకన్న, బొడ్డుపెల్లి వెంకన్న, అలవాలా శ్రీశైలం, కుమ్మర కులస్తులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



తొలి అక్షరం/రాజేంద్రనగర్ ,నవంబర్ 10: మంగళవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు) గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఐఏఎస్ సందర్శించి తనిఖీ నిర్వహించారు.సాధారణ నెలవారీ పరిశీలనలో భాగంగా గోడౌన్‌కు వేసిన సీల్స్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, ఈవీఎంల భద్రత, నిల్వ మరియు పరిరక్షణ చర్యలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ యంత్రాలు మరియు ఇతర ఎన్నికల సామగ్రి నిల్వ విధానాన్ని పరిశీలించారు. గోడౌన్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ నిఘా వ్యవస్థను తనిఖీ చేసి, నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు.అనంతరం ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల సామగ్రి భద్రతలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, నిర్దేశిత నిబంధనలను తప్పక పాటించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్, తహశీల్దార్, వేర్‌హౌస్ ఇన్‌చార్జి రాములు, ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా, పోలీసు అధికారులు మరియు సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

మోత్కూలగూడలో ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు
- గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెట్ట రాజు



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 10: నందిగామ మండలం మోత్కూలగూడ గ్రామంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెట్ట రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ప్రజా సంక్షేమం, అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ జెట్ట శంకరయ్యతో పాటు పార్టీ పెద్దలు, యువ నాయకులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

నరసింహులపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా చౌడారపు శ్రీనివాస్ ఎన్నిక

జర్నలిస్టుల కష్టసుఖాల్లో తోడుంటా.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తా: శ్రీనివాస్



తొలి అక్షరం/నరసింహులపేట: సెప్టెంబర్ 10: నరసింహులపేట ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా చౌడారపు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చౌడారపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. జర్నలిజం అనేది కేవలం వార్తలు రాయడం, ప్రసారం చేయడం మాత్రమే కాదని, ప్రజల కన్నీళ్లకు అక్షరరూపం ఇచ్చి, వారి సమస్యలకు పరిష్కార మార్గం చూపించే గొప్ప బాధ్యత అని అన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే విలేకరులు తమ వ్యక్తిగత జీవితాల్లో ఎన్నో ఆర్థిక, కుటుంబ, ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరికి కష్టం వచ్చినప్పుడు ప్రెస్ క్లబ్ అండగా నిలవాలి.. ఒక జర్నలిస్టు సమస్య అందరి సమస్యగా భావించే ఐక్యత మనలో రావాలి. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, గౌరవం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీనియర్ జర్నలిస్టులకు గౌరవం ఇస్తూ, యువ జర్నలిస్టులకు ప్రోత్సాహం అందిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానన్నారు. నరసింహులపేట మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, రైతుల ఇబ్బందులు, గ్రామాల్లో అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు, తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం వంటి ప్రతి అంశాన్ని తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రెస్ క్లబ్‌ను జర్నలిస్టుల ఐక్యతకు, ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలబెడతానని స్పష్టం చేశారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. **నూతన అధ్యక్షుడిని సన్మానించిన వారు:** ఆంధ్రజ్యోతి విలేకరి ఉపేందర్, ప్రజాసం విలేకరి ఉపేందర్, ఆంధ్రప్రభ విలేకరి కొండపత్రి రవికుమార్, నమస్తే న్యూస్ విలేకరి గణేష్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు చౌడారపు శ్రీనివాస్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు.

క్రిస్మస్ వేడుకల నిర్వహణపై క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ సమావేశం

- ప్రభుత్వ క్రిస్మస్ కానుకలు, చర్చిల అభివృద్ధి, క్రైస్తవుల సమస్యలపై చర్చ



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 10: రాబోయే క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని క్రైస్తవులకు ప్రభుత్వం అందించనున్న క్రిస్మస్ కానుకలు, చర్చిల అభివృద్ధి, క్రైస్తవుల సమస్యలపై క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ నియోజకవర్గంలోని క్రైస్తవుల సమస్యలు, అవసరాలపై సమీక్షించారు. షాద్‌నగర్ ప్రాంతంలోని క్రైస్తవుల శ్మశాన వాటికల ఏర్పాటు, అభివృద్ధికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అందిస్తున్న సహకారాన్ని సమావేశంలో ప్రస్తావించారు. నియోజకవర్గంలో క్రైస్తవుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎమ్మెల్యే చేస్తున్న కృషిని వివరించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకలు, క్రైస్తవులకు ప్రభుత్వం అందించే విందు కార్యక్రమంపై చర్చించారు. ముఖ్యమంత్రి నిర్వహించే క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దీపక్ జాన్ కోరారు. ఈ సమావేశంలో క్రిస్టియన్ మైనార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జి. రవితేజ (చిన్న) పాల్గొన్నారు.

బోడుప్పల్ పరిసర ప్రాంతాల్లో నేడు విద్యుత్ అంతరాయం

- హెచ్ఎండిఏ రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం విద్యుత్ లైన్ల మార్పిడి
- ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు సరఫరా నిలిపివేత
- బోడుప్పల్ ఏఈ ఎన్. వేణుగోపాల్

తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్10: బోడుప్పల్ ప్రధాన రహదారిపై హెచ్ఎండీఏ చేపడుతున్న ప్రత్యేక అభివృద్ధి పనుల్లో భాగంగా, విద్యుత్ లైన్ల మార్పు పనులు అత్యవసరంగా చేపట్టాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నేడు బోడుప్పల్ సబ్-స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు బోడుప్పల్ ఆపరేషన్స్ ఏఈ ఎన్. వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ బోడుప్పల్ సబ్-స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యే 11 కేవీ ఇందిరానగర్ ఫీడర్ పరిధిలో ఈ పనులు జరగనున్నాయి. **పనుల వివరాలు:** బోడుప్పల్ రోడ్డు వెంబడి 33/11 కేవీ బోడుప్పల్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఇందిరానగర్ ఫీడర్ పై ఐదు స్పాన్ల మేర కొత్తగా 11 కేవీ ఓవర్ హెడ్ (ఓఎచ్) విద్యుత్ లైన్ల ట్విస్టింగ్ పనులు చేపట్టనున్నారు. అలాగే, అదే మార్గంలో అడ్డుగా ఉన్న పాత విద్యుత్ లైన్లు, పాత విద్యుత్ స్తంభాలను పూర్తిగా తొలగించే అత్యవసర పనులను చేపట్టనున్నట్లు ఏఈ వెల్లడించారు. ఈ సాంకేతిక కారణాల రీత్యా ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయబడుతుంది. ఈ విద్యుత్ అంతరాయం క్రింది కాలనీలు మరియు ప్రాంతాలపై ప్రభావం చూపనుంది: సాయిరామ్ కాలనీ, శ్రీనివాస కాలనీ, బృందావన్ కాలనీ, ఆనంద్ నగర్, ఎస్సీ బస్తీ, బొమ్మక్ బ్రదర్స్ కాలనీ, తూర్పు హనుమాన్ నగర్, పశ్చిమ హనుమాన్ నగర్, సన్నీ బేకరీ మెయిన్ రోడ్డు, సాయి భవానీ నగర్ లు ఉన్నాయి. ఈ ప్రాంతాల ప్రజలు, వ్యాపారులు మరియు వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి తగినట్లుగా ముందస్తు ఏర్పాట్లు చేసుకుని, విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని ఏఈ ఎన్. వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు.



ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం కల్పించాలి

- డిమాండ్లు పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్త సమ్మె



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 10: ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల స్థిర వేతనం చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ, ఆశా వర్కర్ల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపడతామని హెచ్చరిస్తూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్. రాజు, సహాయ కార్యదర్శి సాయిబాబు, శ్రీనునాయక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 ఏళ్లుగా ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం నెలకు రూ.9,900 మాత్రమే పారితోషికం అందుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, రూ.50 లక్షల బీమా, పదవీ విరమణ ప్రయోజనాలు, సెలవులు కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రక్తదానంతో చిన్నారికి పునర్జన్మ ప్రసాదించిన జర్నలిస్టు సురేష్

-బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారి కత్తి ఐరా కోసం 22వ సారి రక్తదానం
-ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వం: సురేష్ ఇడపాక



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్10: బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్న ఓ చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు సామాజిక కార్యకర్త, జర్నలిస్టు సురేష్ ఇడపాక ముందుకు వచ్చి తన మానవత్వాన్ని చాటుకున్నారు. లక్డీకాపూల్‌లోని ఎం.ఎన్.జే. క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కత్తి ఐరా (సమేరా) అనే చిన్నారి పరిస్థితి తెలుసుకుని ఆయన చలించి పోయారు. చిన్నారి వైద్యానికి తన వంతుగా సహకరించాలనే ఉద్దేశంతో సోమవారం బర్కత్‌పురాలోని జాగృతి బ్లడ్ బ్యాంక్‌లో స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సురేష్ ఇడపాక తన జీవితంలో ఇలా 22వ సారి రక్తదానం చేయడం విశేషం. ఈ సందర్భంగా సురేష్ ఇడపాక మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం మరొకరి ప్రాణాలను నిలపడమే కాకుండా, ఆ నిరాశలో ఉన్న కుటుంబానికి పెద్ద ఆసరాగా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు వచ్చి, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. రక్తదానం కేవలం దానం కాదు.. ఒక ప్రాణానికి ఇచ్చే జీవన భరోసా మన రక్తం మరొకరి జీవితంలో ఆశాదీపం కావాలి అని ఆయన అన్నారు.

లింగారెడ్డిగూడెంలో 583 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- కొత్తగా 93 కుటుంబాలకు కార్డుల మంజూరు
- పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 10: ఫరూక్‌నగర్ మండలం లింగారెడ్డిగూడెంలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో కొత్తగా 93 కుటుంబాలకు సహా మొత్తం 583 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు కావడంపై గ్రామ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎంసీ ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ ఎర్రోళ్ల అశోక్, వార్డు సభ్యుడు మల్లేష్ యాదవ్, జీపీ ఓ రాము, గ్రామ కార్యదర్శి రాము, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



చిన్నారి ప్రాణం కోసం రక్తదానం.. మానవత్వాన్ని చాటిన నెమ్మాది వెంకన్న

- బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న కత్తి ఐరా (సమేరా)కు అండగా నిలుపు
- 16వసారి రక్తదానం చేసి సేవాభావం చాటుకున్న సామాజిక కార్యకర్త



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్10: బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారి కత్తి ఐరా (సమేరా)కు అండగా నిలుస్తూ సామాజిక కార్యకర్త నెమ్మాది వెంకన్న మానవత్వాన్ని చాటుకున్నారు. లక్డీకాపూల్‌లోని ఎం.ఎన్.జే. క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి పరిస్థితి తెలుసుకుని స్పందించారు. చిన్నారి చికిత్సకు తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో నవంబర్ 10న బర్కత్‌పురాలోని జాగృతి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఇది ఆయన జీవితంలో 16వసారి రక్తదానం కావడం విశేషం. ఈ సందర్భంగా నెమ్మాది వెంకన్న మాట్లాడుతూ, అత్యవసర సమయంలో మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం మరొకరి ప్రాణాలను కాపాడటమే కాకుండా, ఆ కుటుంబానికి కొత్త ఆశను అందిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు వచ్చి ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

మహిళా భద్రతకు భరోసా కేంద్రం అండ

సైబరాబాద్‌లో నూతన భరోసా కేంద్రం ప్రారంభం

వైద్యం, న్యాయం, మానసిక కౌన్సెలింగ్ సేవలు ఒకే చోట

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి నవంబర్ 26 నుంచి 28 వరకు ప్రత్యేక సమావేశాలు

పోలీసు సేవలను మరింత ఆధునికీకరిస్తాం: సీపీ రమేష్









తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్10: మహిళలు, బాలికల భద్రతకు మరింత భరోసా కల్పించడంతో పాటు బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయ సేవలను ఒకే చోట అందించాలనే లక్ష్యంతో సైబరాబాద్‌లో నూతన భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. మహిళలపై జరిగే లైంగిక దాడులు, ఇతర నేరాలకు గురైన బాధితులకు వైద్య, న్యాయ, మానసిక కౌన్సెలింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావడం ఈ కేంద్రం ప్రత్యేకత. బాధిత మహిళలు ఎదుర్కొనే మానసిక వేదనను తగ్గించడంతో పాటు కేసుల దర్యాప్తు, న్యాయ ప్రక్రియలో అవసరమైన సహకారం అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడనుంది. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ దేశంలోనే ప్రత్యేకమైన విధానంలో భరోసా కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. బాధిత మహిళలకు కేవలం పోలీసు సహాయం మాత్రమే కాకుండా, వారు ఎదుర్కొనే మానసిక సమస్యల నుంచి బయటపడేందుకు అవసరమైన కౌన్సెలింగ్, వైద్య సహాయం, న్యాయపరమైన మార్గదర్శకత్వం కూడా అందించడం ఈ కేంద్రాల ముఖ్య ఉద్దేశమని వివరించారు. మహిళల భద్రతకు సంబంధించి ఎస్ఓఎస్ సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో మహిళల భద్రత కోసం చేపట్టిన పలు కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇచ్చాయని గుర్తుచేశారు. షీ టీమ్స్, షీ షటిల్స్ సేవలతో పాటు పింక్ పెట్రోలింగ్ వాహనాలు, టి-సేఫ్ యాప్ వంటి కార్యక్రమాలు మహిళలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తున్నాయని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజలకు వేగవంతమైన పోలీసు సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. **మహిళల భద్రతలో ఎస్ఓఎస్ సేవలు కీలకం** మహిళల భద్రతకు సంబంధించి ఎస్ఓఎస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని డీజీపీ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు పోలీసుల సహాయం కోరేందుకు వీలుగా సాంకేతిక వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావడం వల్ల తక్షణ స్పందన సాధ్యమవుతుందని వివరించారు. గతంలో జరిగిన రెండు అఘాయిత్య ఘటనల్లో ఆధారాల సేకరణ, కేసుల దర్యాప్తులో పోలీసులు కీలక పురోగతి సాధించిన విషయాన్ని గుర్తుచేశారు. మహిళల భద్రతకు సంబంధించిన అంశాల్లో ఐటీ సంస్థలు కూడా సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. **భరోసా కేంద్రాల నిర్మాణానికి ఆర్థిక సహకారం** అందించిన సంస్థలను డీజీపీ అభినందించారు. మహిళల భద్రత కోసం చేపట్టే కార్యక్రమాలకు కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు మరింత సహకారం అందించాలని కోరారు. **ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ** సైబరాబాద్ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల సంఖ్యతో ట్రాఫిక్ సమస్య తీవ్రత పెరుగుతోందని సీపీ రమేష్ తెలిపారు. ముఖ్యంగా ఐటీ సంస్థలు, ఆసుపత్రులు, ప్రధాన రహదారులు ఉన్న ప్రాంతాల్లో రద్దీ సమయాల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు నవంబర్ 26 నుంచి 28వ తేదీ వరకు మూడు రోజులపాటు 'సైబరాబాద్ మూవ్‌మెంట్' పేరుతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశాల్లో ఐటీ కంపెనీలు, ఆసుపత్రులు, కార్పొరేట్ సంస్థలు, బస్సు రవాణా నిర్వాహకులు, ఎస్ఆర్ఏ ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించాలని సూచించారు. కార్‌పూలింగ్, ప్రజా రవాణా వినియోగం, ఉద్యోగుల ప్రయాణ సమయాల నిర్వహణ వంటి అంశాలపై చర్చించి ట్రాఫిక్ సమస్యల నియంత్రణకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు కొత్త విధానాలను అమలు చేయడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వినియోగించాలని సూచించారు. **పాస్‌పోర్టు సేవల్లో గణనీయమైన పురోగతి** పాస్‌పోర్టు సేవల్లో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రత్యేక గుర్తింపు సాధించిందని సీపీ రమేష్ తెలిపారు. గతంలో పాస్‌పోర్టు దరఖాస్తుల పరిశీలనకు సుమారు 57 రోజులు పట్టేదని, డీజీపీ సీవీ ఆనంద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో చేపట్టిన చర్యలతో ఆ గడువును కేవలం ఎనిమిది రోజులకు తగ్గించగలిగామని గుర్తుచేశారు. ఈ విధానం రాష్ట్రస్థాయిలో సైబరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిందన్నారు. పోలీసు సేవలను మరింత వేగవంతం చేసేందుకు టి-స్పార్క్ వంటి కార్యక్రమాలతో పాటు సీసీటీఎన్ఎస్, ఈ-సాక్ష్య వంటి సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగిస్తున్నామని తెలిపారు. వీటి ద్వారా కేసుల దర్యాప్తు, నేరాల నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామని వివరించారు. కన్విక్షన్ రేటు గతంలో 22 శాతంగా ఉండగా ప్రస్తుతం 42 శాతానికి పెరిగిందని పేర్కొన్నారు. **పోలీసు సేవలకు ప్రజాప్రతినిధుల ప్రశంసలు** ఈ సందర్భంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ సైబరాబాద్ పరిధిలో మహిళల భద్రతతో పాటు సామాజిక అభివృద్ధికి పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కరోనా సమయంలో ఐటీ సంస్థలు అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. పోలీసు శాఖ అందిస్తున్న సేవలతో ప్రజల్లో పోలీసుల పట్ల సానుకూల దృక్పథం పెరుగుతోందని తెలిపారు. ప్రాంతంలో ప్రధాన సమస్యగా ఉన్న ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎండలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డీజీపీ సీవీ ఆనంద్, సైబరాబాద్ సీపీ రమేష్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, పోలీసు అధికారులు, ఐటీ సంస్థల ప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.50 లక్షల విరాళం

- దాతలు ముందుకు రావడం సంతోషం: డిజిపి సి. వి. ఆనంద్

- పోలీసు కుటుంబాల పిల్లల విద్యాభివృద్ధికి చేయూత: ఆప్టిమస్ గ్రూప్ ఛైర్మన్ డి. శ్రీనివాసరెడ్డి



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్ 10: యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ఆప్టిమస్ గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ పార్ట్‌నర్ డాక్టర్ డి. శ్రీనివాసరెడ్డి రూ.50 లక్షల విరాళం అందించారు. మంగళవారం మైండ్ స్పేస్ లోని పెరెల్ క్లబ్ లో నిర్వహించిన ఓపెన్ హౌస్ సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్‌కు విరాళం చెక్కును అందజేశారు. ఈ నిధులను పాఠశాలలో తరగతి గదులు, సైన్స్, టెక్నాలజీ ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా వసతులు, డిజిటల్ విద్యా సదుపాయాల అభివృద్ధికి వినియోగించనున్నారు. పోలీసు సిబ్బంది పిల్లలతోపాటు సాధారణ ప్రజల కుటుంబాలకు చెందిన పిల్లలకు సైతం సమాన ప్రాతిపదికన నాణ్యమైన విద్యను అందించడమే ఈ పాఠశాల లక్ష్యం. విరాళం అందించిన డాక్టర్ శ్రీనివాసరెడ్డిని డీజీపీ సీవీ ఆనంద్ ఈ సందర్భంగా అభినందించారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో అత్యుత్తమ విద్యా ప్రమాణాలు నెలకొల్పేందుకు పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు, దాతలు ముందుకొచ్చి సహకారం అందించాలని ఆయన సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, క్రీడలు, ఇతర రంగాల్లోనూ మెరుగైన అవకాశాలు కల్పించేలా పాఠశాలను అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పోలీసులంటే తనకు ఎంతో గౌరవమని, సమాజ భద్రత కోసం వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. పోలీసు కుటుంబాల పిల్లల విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విద్య ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, ఎస్ఎస్సీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, ఐటీ రంగానికి చెందిన సంస్థలు, ఆర్టీసీ, ఇతర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చీకట్లోనూ ఆగని సొసైటీ పనులు!

- **గార్లఒడ్డులో రాత్రివేళ అధికారుల హడావుడి.. అంతరంగమేమిటి?**
- **పనుల నిర్వహణపై స్థానికుల్లో అనుమానాలు.. ఉన్నతాధికారులు స్పందించేనా?**



తొలి అక్షరం/ఏన్కూరు నవంబర్ 10: ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం గార్లఒడ్డులోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (గ్రూజూ)లో రాత్రివేళల్లోనూ పనులు కొనసాగుతుండటం చర్చనీయాంశంగా మారింది. పగటిపూట నిర్వహించాల్సిన పనులు చీకటి పడిన తర్వాత కూడా కొనసాగించడంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అసలు రాత్రివేళల్లోనే పనులు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? అధికారుల హడావుడి వెనుక కారణాలేమిటి? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై సొసైటీ అధికారులు వివరణ ఇవ్వాలని, పనుల నిర్వహణ తీరుపై ఉన్నతాధికారులు పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

13వ వార్డులో ముమ్మరంగా డ్రైనేజీ శుభ్రత పనులు

- **కౌన్సిలర్ రిజ్వానా ముబారక్ అలీఖాన్**



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 10: షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో కౌన్సిలర్ రిజ్వానా ముబారక్ అలీఖాన్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది డ్రైనేజీల శుభ్రత, పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వార్డులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రిజ్వానా ముబారక్ అలీఖాన్ మాట్లాడుతూ వార్డులో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలకు ఏవైనా సమస్యలు లేదా అసౌకర్యాలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖాదిర్, ఖలీల్, ముస్తాక్ హుస్సేన్, అమ్జద్ హుస్సేన్, ముఖ్తార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



‘పొలిమేర 3‘ గ్లింప్స్

కొమరయ్య తాంత్రికం.. అర్జున్ సర్జా పవర్ఫుల్ ఎంట్రీ

ఓటీటీలో మా ఊరి పొలిమేర తెచ్చుకున్న రెస్పాన్స్, ఆ తర్వాత థియేటర్లలో పొలిమేర 2 సాధించిన సక్సెస్ తో ఈ ఫ్రాంచైజీకి మంచి క్రేజ్ ఏర్పడింది. తక్కువ బడ్జెట్ తో మొదలై బాక్సాఫీస్ వద్ద పెద్ద హిట్ కొట్టిన ఈ సిరీస్ ఇప్పుడు మరో కథతో సిద్ధమవుతోంది. దర్శకుడు డాక్టర్ అనిల్ విశ్వనాథ్ మూడో భాగాన్ని అంతకంటే భారీ స్కేల్ లో సిద్ధం చేస్తున్నారు. దీపావళి పండుగ సందర్భంగా పొలిమేర 3 నుంచి వదిలిన స్పెషల్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. 5 వీడియో ప్రారంభంలో ఒక పాత గుడి గోపురం చుట్టూ కాకులు తిరగడం, ఆకాశంలో అమావాస్య సూర్యగ్రహణం కనిపించి మిస్టీరియస్ వైబ్ సెట్ చేశారు. ఆ వెంటనే గాల్లో తేలివచ్చే ఈక, విష్ణువు నుంచి శివుడి రూపానికి మారే మార్ఫింగ్ విజువల్స్ చూపించారు. అనంతరం శేషశయనుడైన అనంత పద్మనాభ స్వామి భారీ విగ్రహం తెరపైకి వస్తుంది. గత రెండు భాగాల్లో కథను నడిపించిన కొమరయ్య పాత్ర ఇందులోనూ కొనసాగుతున్నట్లు క్లారిటీ ఇచ్చారు. ఒంటిపై బట్టలు లేకుండా నేలపై ముగ్గుల మధ్య కూర్చుని, పుర్రె ముందు దీపాలు వెలిగించి చేతబడులు చేస్తూ సత్యం రాజేష్ కనిపించిన తీరు పాత సినిమాల ఫ్లేవర్ ను గుర్తుచేసింది. ఈ మూడో పార్ట్ లో కొమరయ్య ఎలాంటి తాంత్రిక పూజలు చేయబోతున్నాడనే దానిపై ప్రేక్షకుల్లో ఆలోచనలు రేకెత్తించేలా ఆ షాట్ కుదిరింది ఈ వీడియోలో అసలైన సర్ ప్రైజ్ ఎలిమెంట్ గా నిలిచింది యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా ఎంట్రీ. విరావి అనే పవర్ఫుల్ యోధుడు పాత్రలో ఆయనను పరిచయం చేశారు. నుదుటిపై తిరునామం, రక్తపు మరకలు, పిల్లి కళ్లతో పొడవాటి జుట్టుతో ఉన్న ఆయన రగ్గడ్ అవతారం చాలా కొత్తగా ఉంది. చేతిలో కత్తులు పట్టుకుని అడవిలో శవాల గుట్టల మధ్య నడుస్తూ వచ్చే సీన్ అర్జున్ క్యారెక్టర్ డెప్త్‌ను క్లియర్ గా చాటిచెప్పింది. టెక్నికల్ పరంగా చూస్తే పొలిమేర ప్రపంచం చాలా పెద్దగా విస్తరించినట్లు విజువల్స్ చూస్తే అర్థమవుతుంది. కృష్ణ ప్రసాద్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సిద్ధార్థ్ కెమెరా పనితనం గ్లింప్స్ కు మంచి థ్రిల్లింగ్ ఫీల్ తెచ్చాయి. వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్లపై నిర్మాతలు ఎక్కడా తగ్గకుండా భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఇందులో బాలాదిత్య, కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రాకేందు మౌళి కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

‘అలియాస్ రుక్మిణి’ షూటింగ్ పూర్తి..



నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా వినోదాత్మక చిత్రం ‘అలియాస్ రుక్మిణి‘ షూటింగ్ విజయవంతంగా పూర్తయింది. మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ మొత్తం ముగిసినట్లు నిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు.
ఈ చిత్రాన్ని నేచురల్ స్టార్ నాని సమర్పిస్తుండగా, యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకంపై దీప్తి ఘంటా నిర్మిస్తున్నారు. “అలియాస్ రుక్మిణి షూటింగ్ పూర్తయింది. మరో 25 రోజుల్లో ఎన్నో చెప్పలేని అందమైన భావోద్వేగాలతో కూడిన ఈ చిత్రాన్ని థియేటర్లలో వేడుకగా జరుపుకుందాం“ అని నిర్మాణ సంస్థ పేర్కొంది.దీపావళి పండుగకు ముందు ఈ చిత్రం నుంచి నితిన్ పాత్రకు సంబంధించిన ప్రత్యేక వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఆయన ‘యంగ్ కృష్ణ‘ అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ వీడియోను పంచుకుంటూ, “ప్రతి ప్రేమకథకు ఒక ‘ముందు‘ కథ ఉంటుంది. యంగ్ కృష్ణ.. ఓ కలలు కనే యువకుడు. ఇందులో నన్ను సరికొత్తగా చూస్తారు“ అని నితిన్ పేర్కొన్నారు. రుక్మిణి ఆయన జీవితంలోకి రాకముందు కృష్ణ జీవితం ఎలా ఉండేదో ఈ వీడియో ద్వారా పరిచయం చేశారు. ఇందులో రుక్మిణి పాత్రలో ఆఫియా సయ్యద్ కనిపించనున్నారు.గతంలో విడుదలైన ఈ సినిమా



టైటిల్ టీజర్ కూడా ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. ఆ టీజర్‌లో నటుడు నాని, దర్శకుడు మురళీ మధ్య జరిగే కథా చర్చ ఆకట్టుకుంది. కృష్ణ కథ అని చెప్పి, రుక్మిణి రాసిన పుస్తకాలను ప్రస్తావించగా.. కుర్చీలో కూర్చుని నిద్రపోతున్న నితిన్ మేల్కొని “రుక్మిణి నా భార్య“ అని చెప్పే డైలాగ్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కాన్సెప్ట్ విన్న నాని ఎంతో ఇంప్రెస్ అయ్యి, షూటింగ్ ఎప్పుడు మొదలుపెడదామని ఉత్సాహం చూపించడం టీజర్‌లో కనిపించింది.ఈ సినిమాకు ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. జోమన్ టి. జాన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహించగా, విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. సృజన అడుసుమిల్లి ఎడిటర్‌గా, రేఖ బొగ్గరపు కాస్ట్యూమ్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి రమణ మాధవరం సహ దర్శకత్వం వహించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబర్ 4న వెండితెరపై ప్రేక్షకులను పలకరించనుంది.

టాలీవుడ్ పై కన్నేసిన మలయాళ బ్యూటీ!



మాలీవుడ్ నుంచి టాలీవుడ్ కి దిగుమతై సత్తా చాటిన భామలెంతో మంది. ముంబై భామల తర్వాత ఆ రేంజ్ లో ఫేమస్ అయింది కేరళ కుట్టీలే అనడంలో ఎలాంటి సందేహం లేదు. నయనతార, సాయి పల్లవి, నిత్యా మీనన్, మాళవిక మోహనన్, నివేదా థామస్, కీర్తి సురేష్, అనుపమ పరమేశ్వరన్, సంయుక్తా మీనన్ వంటి భామలు టాలీవుడ్ లో ఎంత ఫేమస్ అయ్యారో తెలిసిందే. తాజాగా ఇదే బాటలోనే మరో మలయాళ ముద్దుగుమ్మ అనస్వర రాజన్ టాలీవుడ్ ..కోలీవుడ్ కోటలను కైవసం చేసుకునేందుకు సిద్ధమైంది.మలయాళంలో -తన్నీర్ మథన్ దినంగల్-, -నేరు-, -సుపర్ శరణ్య- వంటి హిట్ చిత్రాలతో నేచురల్ పెర్ఫార్మర్‌గా పేరు తెచ్చుకున్న అమ్మడు ఇప్పుడు తెలుగు, తమిళ ఇండస్ట్రీలపై ఫోకస్ పెట్టింది. సొంత ఇండస్ట్రీలో వరుస హిట్లు అందుకోవడంతో పాటు ఫిల్మ్‌ఫేర్ వంటి ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్న అమ్మడు క్యూట్ లుక్స్ .. నటనతో తెలుగు మేకర్స్ దృష్టిని కూడా ఆకర్షిస్తుంది. హోమ్లీ లుక్‌తో పాటు కథానాయికగా ఏ తరహా పాత్రనైనా పండించగల ప్రతిభ ఉండటంతో టాలీవుడ్ నుంచి సొగసరికి అవకాశాలు తలుపు తడుతున్నాయి. దక్షిణాదిలో మార్కెట్‌ను విస్తరించుకునేందుకు ఇదే సరైన సమయమని భావించిన బ్యూటీ టాలీవుడ్ వైపు వేగంగా అడుగులు వేస్తుంది. ఇప్పటికే రోషన్ మేక సరసన -ఛాంపియన్- చిత్రంతో టాలీవుడ్ లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అక్కినేని నాగార్జున సమర్పణలో రూపొందుతున్న -ఇట్లు అర్జున- అనే క్రేజీ ప్రాజెక్ట్‌లో నటిస్తోంది. అలాగే -7 జీ రెయిన్ బో కాలనీ 2-లోనూ అమ్మడు ఎంపికైంది. -బృందావన కాలనీ- సినిమాకు సీక్వెల్ గా రూపొందుతున్న చిత్రమిదిఅలాగే మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తోన్న -కాకా- చిత్రంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈసినిమా గనుక హిట్ అయితే అనస్వర పేరు టాలీవుడ్ లో మారు మ్రోగిపోతుంది. దీంతో పాటు హీరోయిన్ గా ఎంపికైన చిత్రాలు సక్సెస్ అయితే టాలీవుడ్ లో అమ్మడి ఇమేజ్ కి తిరుగుండదు. ప్రస్తుతం ఫామ్ లో ఉన్న యంగ్ హీరోలకు కొత్త భామలు అవసరం.

“రాజకీయాలను నిశితంగా గమనిస్తున్నా”..

పొలిటికల్ ఎంట్రీపై హీరో సూర్య ఆసక్తికర వ్యాఖ్యలు



తమిళనాడులో నటుడు విజయ్ రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడంతో మరో హీరో సూర్య రాజకీయ ప్రవేశంపై చర్చ మొదలైంది. ఆయన కూడా రాజకీయాల్లోకి వస్తారా? విజయ్ బాటలో నడుస్తారా? అంటూ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ ప్రశ్నలకు సూర్య స్వయంగా సమాధానమిచ్చారు. ప్రస్తుతానికి రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని స్పష్టం చేశారు.చెన్నైలో జరిగిన తన తాజా చిత్రం ‘సీన్‘ విజయోత్సవ కార్యక్రమంలో సూర్య ఈ విషయంపై మాట్లాడారు. రాజకీయాల్లోకి రావడం లేదని చెబుతూనే.. రాజకీయాలంటే తనకు ద్వేషం లేదని పేర్కొన్నారు. రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నానని చెప్పారు. ఆ రంగంపై పూర్తిస్థాయి అవగాహన, బాధ్యతల గురించి తెలుసుకోకుండా రాజకీయాల్లోకి అడుగుపెట్టబోనని స్పష్టం చేశారు.
సూర్య రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారం ఎప్పటి నుంచో ఉంది. ముఖ్యంగా విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు సాయం చేస్తున్న ఆయన ‘అగరం ఫౌండేషన్‘ సేవా కార్యక్రమాలు ఈ చర్చకు కారణమయ్యాయి. సూర్య నటించిన ‘సీన్‘ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధిస్తోంది. జీతు మాధవన్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ కామెడీ చిత్రంలో నజ్రియా నజీమ్, మలయాళ నటుడు నస్లెన్ కీలక పాత్రల్లో నటించారు. నవంబర్ 6న విడుదలైన ఈ సినిమా తొలి మూడు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.116 కోట్లకు పైగా వసూలు చేసినట్లు సాక్‌నిల్క్ వెల్లడించింది. భారత్‌లో నెట్ వసూళ్లు రూ.62.75 కోట్లకు చేరినట్లు పేర్కొంది.

ఎల్ఏసీఎంఏ గాలాలో హృతిక్...

అరుదైన ఘనత సాధించిన తొలి భారత నటుడిగా రికార్డ్



బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ అంతర్జాతీయ వేదికపై అరుదైన గౌరవాన్ని అందుకున్నాడు. లాస్ ఏంజిల్స్‌లో ప్రతిష్ఠాత్మకంగా జరిగే ఎల్ఏసీఎంఏ ఆర్ట్ + ఫిల్మ్ గాలాకు హాజరైన తొలి భారతీయ నటుడిగా చరిత్ర సృష్టించాడు. నవంబర్ 7న జరిగిన ఈ 15వ వార్షికోత్సవ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.ఈ కార్యక్రమానికి హృతిక్ ఇటాలియన్ లగ్జరీ బ్రాండ్ ‘బ్రునెల్లో కుసినెల్లి‘ డిజైన్ చేసిన డార్క్ బ్లూ టక్సెడోలో హాజరయ్యాడు. రెడ్ కార్పెట్‌పై ఫొటోగ్రాఫర్లకు రెండు చేతులు జోడించి నమస్కారం పెట్టి, భారతీయ సంస్కృతిని చాటాడు. ఈ దృశ్యాలు, అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.ప్రముఖ హాలీవుడ్ నటుడు లియోనార్డో డికాప్రియో సహ-చైర్‌గా వ్యవహరించే ఈ గాలా ఆర్ట్, సినిమా రంగాలను ప్రోత్సహించడానికి నిధులు సేకరిస్తుంది. ఈ ఏడాది ఈ వేడుక ద్వారా దాదాపు 70 లక్షల డాలర్లు సమీకరించారు. ఈ ఈవెంట్‌లో హృతిక్‌తో పాటు టామ్ హ్యాంక్స్, కిమ్ కర్దాషియన్, ఆండ్రూ గార్‌ఫీల్డ్, తిమోథీ చలమెట్ వంటి అనేక మంది హాలీవుడ్ ప్రముఖులు పాల్గొన్నారు.ఈ వేడుకలో హృతిక్‌ను భారత సంతతికి చెందిన నిర్మాత కవితా గుప్తా హోస్ట్ చేశారు. ‘డ్యూన్’ చిత్ర దర్శకుడు డెనిస్ విల్లెన్యూవ్, నటి నికోల్ కిడ్‌మాన్‌లతో హృతిక్ దిగిన ఫొటోలు కూడా వైరల్ అయ్యాయి. ఇక సినిమాల విషయానికొస్తే, ఇటీవల ‘వార్ 2’తో విజయం సాధించిన హృతిక్, త్వరలో ‘క్రిష్ 4’ చిత్రంతో నటుడిగా, దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు రానున్నాడు.

Editor Pastham Saidulu, Tholi Aksharam, PRGI No. TGMUL/25/A1386,Gmail: tholiaksharam@gmail.com , Printing : R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad, Cell No: 8074571329, Telangana State, India.